

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 20 సంచిక : 2 అక్టోబర్ 2014

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు
23-09-2014

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూః మాతే సంఘస్త్వకర్మణి

మనం పని చేస్తూ ఉండాలి. సుఖంగా ఉండాలి, శాంతిగా ఉండాలి. పని మానేస్తే జ్ఞానం వస్తుందని అనుకోవద్దు. పని మానేస్తే జ్ఞానంరాదు, సోమరితనం వస్తుంది. పని ద్వారా మనం జ్ఞానాన్ని పొందవచ్చు. నిష్కామకర్మ చేయటంద్వారా, సెల్ఫ్‌లెస్ సర్వీసు ద్వారా కూడా ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చు. కర్మలను ఆచరించటం యందే నీకు అధికారం కలదు. మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకోండి. పని దగ్గర అశ్రద్ధ ఉండకూడదు. ఏ రోజు పని ఆ రోజే చేసుకోవాలి. పని మానేస్తే జ్ఞానం వస్తుందని ఎవరూ అనుకోవద్దు. పనిద్వారా కూడా తరించవచ్చు. కర్మని యోగంగా చేయటం వలన మోక్షం వస్తుంది. కర్మచేయుట యందే నీకు అధికారం కలదు కాని దాని ఫలితము మీద నీకు అధికారం లేదు. ఒకేపనిని నలుగురు చేసినా వారికి ఫలితం ఒకేరకంగారాదు, రకరకాలుగా వస్తుంది. దానికి పూర్వజన్మకు ఏదో సంబంధం ఉంటుంది. కొంతమంది చాలా హాయిగా, శాంతిగా ఉంటున్నారు. కొంతమంది జీవితాలలో చాలా కష్టపడుతున్నారు, అశాంతిగా ఉంటున్నారు. ఈ లోకం పరిస్థితి ఇలా ఉంది ఏమిటి అంటే దీనికి వారి పూర్వజన్మలకు ఏదో సంబంధం ఉంటుంది. పూర్వజన్మల అనుబంధాన్నిబట్టి ఇది జరుగుతూ ఉంటుంది.

నువ్వు చేసే పని శ్రద్ధగా చెయ్యి. హెచ్చుతగ్గులు లేకుండా

సమానంగా పని చేస్తూ ఉండు. కర్మఫలానికి నువ్వు కారణం కారాదు. నువ్వు పని చేస్తూ ఉంటే దానికి ఫలితం రాకుండా ఎలా ఉంటుంది, ఏదో ఒక ఫలితం వస్తుంది. ఆ ఫలితానికి నేనే కారణం అనుకొని, నా వల్లనే ఆ పని పూర్తి అయ్యింది అనుకొన్నారా మీకు పునర్జన్మ వచ్చి తీరుతుంది. మేము ఇది సాధించాము, అది సాధించాము అని చాలామంది అంటూ ఉంటారు. అది నూటికి నూరుపాళ్ళు అజ్ఞానం. సాధించటానికి అసలు నువ్వు అంటూ ఒకడవు ఉన్నావా? కర్తురాజ్ఞయా ప్రాప్యతేఫలం కర్మకింపరం కర్మత్జ్జడం. ఈశ్వరుడి ఆజ్ఞననుసరించి అంతా నడుస్తుంది. మీరు గోడ కట్టించుకుంటే మీ గోడ కూలిపని యివ్వదు. మీరు కూలి పనియిస్తారు. అలాగే కర్మ అనేది జడవస్తువు. కర్త ఫలితాన్ని ఇస్తాడు కాని ఈ జడవస్తువు ఫలితాన్ని ఇవ్వదు. భగవంతుడికి కర్మఫలదాత అని పేరు ఉంది. కర్మ మీరు చేస్తారు. దానికి ఫలితాన్ని ఎంత ఇవ్వాలి? ఎప్పుడు ఇవ్వాలి? అని నిర్ణయించేది భగవంతుడే. కంట్రోలర్ ఆయనే. ఆయన ఎక్కడో మనకు దూరంగా లేడు, మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు.

కర్మఫలం కంట్రోలర్ చేతిలో ఉంది. ఆయన ఎంత ఇస్తాడు, ఎప్పుడు ఇస్తాడు అనే గొడవలు వదిలేయండి. ఆయన ఎక్కువ ఇచ్చినా, తక్కువ ఇచ్చినా హెచ్చుతగ్గులు లేకుండా, మనస్సులో వికారాలు పెట్టుకోకుండా, ఇది భగవంతుడి ప్రసాదం అని భావిస్తూ కర్మ చేయండి. కర్మఫలితానికి నేనే కారణం అనేటువంటి భావన లేకుండా కర్మ చెయ్యండి. కర్మ చేయండి కర్తృత్వం పెట్టుకోవద్దు. కర్తలేని కర్మను ఆచరించండి. కర్తలేని కర్మను ఆచరించటం వలన కర్మ మిమ్మల్ని బంధించదు. కర్మ మిమ్మల్ని బంధించకపోతే పునర్జన్మ హేతువులు తగ్గిపోతాయి.

ప్రాక్టీస్ ప్యూరిటీ, ప్రాక్టీస్ ఛారిటీ. మీరు ఇంటి దగ్గర ఒక మాట మాట్లాడండి, ఒక పని చెయ్యండి, మీకు ఒక ఆలోచన రానివ్వండి, మీ మాటలో, చేతలో, ఆలోచనలో పవిత్రతను ప్రాక్టీసు చెయ్యండి. మీ శరీరం చనిపోకముందే మీరు మోక్షస్థితిని పొందుతారు. ప్రాక్టీస్ ఛారిటీ అనేమాట అందరికీ సాధ్యంకాదు, కలిగిఉన్నవారు ప్రాక్టీస్ ఛారిటీ. హృదయంలో ఉన్న అంతర్యామి ఎంత పవిత్రంగా ఉన్నాడో, ఎక్కడా కల్మషం లేకుండా ఎంత ప్యూరిఫైడ్‌గా ఉన్నాడో మన మాట ద్వారా, చేత ద్వారా, ఆలోచన ద్వారా అంత ప్యూరిటీని కనుక మనం సాధిస్తే మనం అందరం జీవన్ముక్తులము అవుతాము. అప్పుడు ఆనందం కోసం, శాంతికోసం మీరు ఇంట్లో ఉన్న వ్యక్తులమీదకాని, సమాజంమీదగాని, ప్రభుత్వంవారిమీదకాని ఎవరిమీద ఆధారపడనక్కరలేదు. మీకు సుఖం రానివ్వండి, శాంతి రానివ్వండి అవి లోపలనుండే

వస్తాయి కాని బయటనుండి ఏమీ రాదు. ఇది రాత్రి, ఇది పగలు అనక మీరు నిరంతరం శాంతిస్థితిలో కనుక ఉంటే ఇంక మీకు ఏమికావాలి. ఒక దేశానికి రాజు అనుభవించలేని స్థితిని మీరు అనుభవిస్తూ ఉంటారు. ఆ స్థితిలో మీరు ఉన్నప్పుడు మీకు ఒక రాజ్యం యిచ్చినా మీరు దానిని రిజక్టు చేస్తారు. ఆ స్థితి మీకు ఎలాగ వస్తుంది అంటే ప్రాక్టీసు ప్యూరిటీ. ఆధ్యాత్మికసాధన అంటే ఏదో ఏదో చెయ్యటంకాదు, మీ శరీరాన్ని ఎంత పరిశుద్ధంగా ఉంచుకుంటున్నారో మీ మనస్సునుకూడా అంత పరిశుద్ధంగా ఉంచుకోవటమే సాధన. మీ మనస్సు పరిశుభ్రంగా ఉండాలి. మీ హృదయంలో ఉన్న వస్తువు ఎంత పరిశుద్ధంగా ఉందో మీ మనస్సు కూడా అంత పరిశుద్ధం అయినప్పడు ఇది తదాకారం చెందుతుంది. అప్పడు చావుపుట్టుకలతో సంబంధం లేకుండా మీరు ఉంటారు. ఆ ఉండటంలోనే శాంతి ఉంది, సుఖం ఉంది, ఆనందం ఉంది. ఉండటం అనే స్థాయికి మీరు వచ్చినప్పడు చావు మొఖం ఎలా ఉంటుందో మీకు తెలియదు, పుట్టుక మొఖం ఎలా ఉంటుందో మీకు తెలియదు.

మీరు సంతోషంగా ఉన్నారు అనుకోండి. ఎప్పడూ అలాగే ఉంటాము అని అనుకోవద్దు. కాలప్రవాహంలో ఇది కొట్టుకొనిపోతుంది. మీరు దుఃఖంగా ఉన్నారు అనుకోండి ఆ దుఃఖం కూడా ఎప్పడూ ఉండదు. అదీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. ఇవి నిజం అనుకోవద్దు. ఈవెన్ దిస్ విల్ పాస్ ఎవే, ఈవెన్ దిస్ విల్ పాస్ ఎవే. పెద్ద పెద్ద సామ్రాజ్యములే కాలప్రవాహంలో కొట్టుకొనిపోతున్నప్పడు మీకు వచ్చిన సుఖం, మీకు వచ్చిన దుఃఖం ఎంతకాలం ఉంటాయి. మీరు ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఆయన నిర్ణయం ప్రకారమే అంతా జరుగుతుంది. మీచేతిలో ఉన్న పనిని రాగద్వేషములు లేకుండా, శ్రద్ధగా చేయండి. ఈశ్వరుడి చేతిలో ఉన్న పనిని ఎప్పడు చెయ్యాలి? ఎక్కడ చెయ్యాలి? ఎలా చెయ్యాలి? ఎప్పడు మిమ్మల్ని సింహాసనం మీద కూర్చోబెట్టాలి? అనేది ఆయనే నిర్ణయించుకుంటాడు. కొండమీద దీపం పెట్టి ఎవరికీ కనబడకుండా మనం చేయగలమా? భగవంతుడే మిమ్మల్ని ఉద్ధరించాలి అనుకొన్నప్పడు మేము ఆపుచేయగలమా? ఒకవేళ ఆపుచేస్తేమటుకు అది ఆగుతుందా? గాలివాన వస్తూ ఉంటే మనం చేయి అడ్డంగా పెడితే గాలివాన ఆగిపోతుందా? ఆగదు. ఈశ్వర నిర్ణయం ప్రకారం అంతా జరిగిపోతుంది. కర్తృత్వం, భోక్తృత్వం ఇవి రెండే మనిషిని బంధించేవి. ఇది కష్టపడి నేను సాధించాను, ఈ మేడ నేను కట్టాను, కట్టాను కాబట్టే మేడలో కూర్చుని సుఖపడుతున్నాను అంటారు. కట్టటానికి నువ్వు ఎవడవు? సుఖపడటానికి నువ్వు ఎవడవు?

కర్తృత్వం ఉన్నచోట భోక్తృత్వం వచ్చేస్తుంది. ఈ కర్తృత్వం, భోక్తృత్వం ఎంతకాలమైతే జీవుడిలో ఉన్నాయో అంతకాలం జననమరణచక్రంలో నుండి బయటకు రాలేడు, కోటి జన్మలు ఎత్తినా బయటకు రాలేడు. మీరు చిల్లర గొడవలలోనికి వెళ్ళవద్దు. భగవదనుభవం పొందటానికి మీలోపల ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో జాగ్రత్తగా చూసుకొంటూ, ఎటువంటి స్నేహాలు చేస్తే ఆ ఆటంకాలు తొలగిపోతాయో అటువంటి స్నేహాలు చెయ్యాలి, అదే సజ్జనసాంగత్యం. చెప్పే వ్యక్తి కూడా ఏదో చెప్పటంకాదు, వినేవాడిపట్ల వాడికి ప్రేమ ఉండాలి, ఆప్యాయత ఉండాలి, వాడు బాగుపడాలి, సత్యానుభవం పొందాలి అనే కాంక్ష ఉండాలి.

ఇది భౌతికం, ఇది ఆధ్యాత్మికం అని లేదు. అసలు భౌతికం అనేది లేదు, ఉన్నది ఆధ్యాత్మికమే. భౌతికమైన పనిని కూడా మీరు ఆధ్యాత్మికదృష్టితో చూస్తే అసలు భౌతికం అనేది లేనేలేదని మీకు తెలుస్తుంది. సునీల్ నిన్న ఎవరో ఇద్దరిని పాలకొల్లు రైల్వేస్టేషన్‌లో డ్రాప్‌చేసి వచ్చాడు. ఇది భౌతికమే. సునీల్ వారిని తీసుకొనివెళ్ళటంలో ఏదైనా కోరిక ఉందా, లేకపోతే ఏదైనా ప్రతిఫలం కాంక్షించి వారిని పాలకొల్లు తీసుకొని వెళ్ళాడా అంటే అతనికి ఏమీ కోరికలేదు, ఏమీ ప్రతిఫలం ఆశించటంలేదు. స్టేషన్‌లో డ్రాప్ చేయమన్నాము, చేసివచ్చాడు అంతే. ఇది భౌతికంకాదు, ఇది ఆధ్యాత్మికమే అని చెప్పాను. భౌతికం అనేది అసలు లేదు. సబ్జక్టు అవగాహనలేక, హృదయం యొక్క లోయలలోనికి దిగలేక ఇది భౌతికం, ఇది ఆధ్యాత్మికం అని లోకులు విడదీసుకుంటున్నారు కాని అసలు భౌతికం అనేది లేనేలేదు. ఈశ్వరుడికంటే పెద్దవాడుకాని, ఆయనతో సమానమైనవాడు కాని ఈ సృష్టిలో ఎవడూ లేడు. అందుచేత మీరు కుటుంబపరంగా కాని, సమాజపరంగాకాని ఒకమాట మాట్లాడినా, ఒకపని చేసినా దానిని ఈశ్వరుడికి అంకితభావంతో చెయ్యండి. అలా చేయటంవలన మీరు ఈశ్వరుని స్వరూపాన్ని పొందుతారు. ఇవి వట్టిమాటలు అని మీరు అనుకోవద్దు. అలా జీవించటం వలన మీరు భరించలేనంత శాంతిని, ఆనందాన్ని పొందుతారు. ఎవరిని అడిగినా మాకు శాంతిలేదు, మాకు సుఖంలేదు అంటున్నారు. శాంతి మీ శిరస్సుమీద వర్షించటానికి సిద్ధంగా ఉందని మీకు తెలియటంలేదు. శాంతి వర్షిస్తుంది. వెయిట్ అండ్ సీ.

కొంతమంది ఎంతసేపు నేను అది సాధించాను, ఇది సాధించాను అని చెపుతూ ఉంటారు. వీటి వలన నీలోపల ఉన్న అజ్ఞానం పెరుగుతూ ఉంటుంది, అహంకారం పెరుగుతూ ఉంటుంది. అది నీకు తెలియటంలేదు. ఇంటిలో కూర్చుని ఇటువంటి మాటలు మాట్లాడుతూ

ఉంటే నీకు పదిజన్మలు రావలసినవి, వెయ్యిజన్మలు వస్తాయి. అసలు మాటలోకాని, చేతలోగాని, ఆలోచనలోగాని నువ్వు కనబడకూడదు, అసలు వ్యక్తి దొరకకూడదు. అలా మీరు ప్రాక్టీసు చెయ్యాలి. కాని మీరు దొరికేస్తున్నారు. కొంతమంది చిన్నపని చేస్తారు, నేను చేసాను, నేను చేసాను అంటారు. అది ఒక అలవాటు. మనిషి యొక్క జీవితం అంతా అలవాట్ల సమూహమే. మీకు ఈశ్వరానుగ్రహం కనుక ఉంటే అలవాట్లు నెమ్మదిగా జారిపోతాయి. మాలో ఈ అలవాట్లు ఉన్నాయి, ఈ అలవాట్లను విడిచిపెట్టాలి అనే తలంపు కొంచెం ఉంటే, దానికోసం మీరు కొంచెం సాధనచేస్తే పెద్దబండరాళ్ళ అంత బరువు ఉన్న అలవాట్లు మీలో ఉన్న ఈశ్వరుని దయవలన అవి అన్నీ రాలిపోతాయి. మనం మాట్లాడేటప్పడు కూడా సెన్స్ ఉండాలి. ఎవడో చెడ్డమాటలు మాట్లాడుతున్నాడు అనుకోండి నువ్వు వాటిని భుజాన వేసుకొని తిరగవద్దు. వివేకం లేనివాడు ఎవడో ఒకమాట అంటే వివేకవంతుడివి అయిన నువ్వు దానిని ఎందుకు రిపీట్ చెయ్యాలి? వాటిని రిపీట్ చేస్తున్నావు అంటే నీలో కూడా పాడుబుద్ధి ఉందని అర్థం. నీలో పాడుబుద్ధి లేకపోతే ఆ మాటలను నువ్వు ఎందుకు రిపీట్ చేస్తున్నావు.

నీ పని ఏదో నువ్వు చేసుకో. ఫలితం ఎక్కువ రావచ్చు, తక్కువ రావచ్చు, అసలు రాకుండా ఎప్పడూ ఉండదు. నిన్ను పరీక్షించటానికి ఒకోసారి వాయిదావేస్తూ ఉంటాడు. నీకు కర్మఫలం రాలేదు అనే ఉద్దేశంతో మీ కుటుంబపరంగాకాని, సమాజపరంగాకాని, దైవపరంగాకాని నువ్వు చేయవలసిన డ్యూటీ విషయంలో, కర్మకాండలో అశ్రద్ధగా ఉండ కూడదు. అంటే అక్కడ కోరిక లేకుండా కనుక నువ్వు చేస్తే నీకు ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. అసలు నీకు ఈశ్వరానుగ్రహం కలగాలి కాని మోక్షం ఎంతసేపువస్తుంది. ఆ క్షణంలో వచ్చేస్తుంది, మీరు భరించలేనంత ఆనందాన్ని పొందుతారు. ఏమిటి నాన్నగారు ఇలా చెపుతున్నారు అని అనుకోవద్దు. కొద్దికాలంలో మీకే తెలుస్తుంది. మీరు మారుమనస్సు ఎలా పొందుతారో, మీకు సుఖానుభవం ఎలా కలుగుతుందో మీ అనుభవంలో మీరు చూస్తారు. కంగారుపడవద్దు. ఇవన్నీ వట్టిమాటలుకాదు. మీరు ప్యూరిటీని ప్రాక్టీసు చెయ్యండి. మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. శాంతి, ఆనందం వచ్చి మిమ్మల్ని వరిస్తాయి. మీరు కర్మ చేయటం మానవద్దు. కొంతమంది ఏమంటారు అంటే మేము కష్టపడి పని చేస్తున్నాము, ఇంటిలో గుర్తింపు లేదు అంటారు. ఇంట్లో గుర్తింపులు లేకపోయినా ఈశ్వరుడు మిమ్మల్ని గుర్తిస్తాడు. మీకు మార్కులు వేసేవాడు, ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితిని ఇచ్చేవాడు ఈశ్వరుడే.

ఇంట్లో ఉన్న ఈ నరులు గుర్తిస్తే ఏమిటి? వారు మిమ్మల్ని గుర్తించకపోతే ఏమిటి? వారు గుర్తించకపోవటం వలన మీకు వచ్చే నష్టం ఏమీ లేదు. కాని మీ అహంకారం ఏమంటుంది అంటే వారు గుర్తిస్తే బాగుండును అని అంటుంది. గుర్తించకపోవటమే మంచిది. వారు ఎక్కువగా గుర్తిస్తున్నారు అనుకోండి మీకు మోహం పెరిగిపోతుంది. ఈ పొగడ్తలకు, విమర్శలకు అతీతంగా ఉంటే మనం బాగుపడతాము కాని లేకపోతే చెడిపోతాము. ఎవడో తెలివిలేకుండా మాట్లాడుతున్నాడు అనుకోండి. నువ్వు వాడి స్థాయికి పడిపోయి తెలివిలేకుండా మాట్లాడటం ఎందుకు? ఇప్పుడు నేను చెప్పే విషయాలు చదువుకోవటం వలన రాదు. కామన్‌సెన్స్ వలన వస్తుంది.

లోకుల మాటలు మీరు పట్టించుకోవద్దు. లోకులు ఎంత విచిత్రంగా ఉంటారు అంటే మీరు ధనవంతులు కాదు అనుకోండి, మిమ్మల్ని లోకువగా ఆక్షేపణగా చూస్తారు. మీరు ధనవంతులు అయిపోయారు అనుకోండి, అప్పుడు అసూయగా చూస్తారు. వారి మాటలు పుచ్చుకుని మీరు ఊరేగుతారా? ఆక్షేపణా మన మనస్సును ముట్టుకోకూడదు, అసూయ ముట్టుకోకూడదు, రెండూ మనకు అనవసరమే, రెండూ చెడ్డవే. ఇవి అన్నీ మన మనస్సును టచ్ చేయకుండా చూసుకోవాలి. మీరు చెయ్యవలసిన పని చేస్తూ ఉండటం, సాధన చేస్తూ వెళ్ళటం అంతేగాని మోక్షం ఎప్పుడు వస్తుంది అనే గొడవ వద్దు. అది భగవంతుడు చూసుకుంటాడు. మీలో వాసనాక్షయం ఎప్పుడైతే అయిందో అప్పుడు అమృతనాడి తెరుచుకుంటుంది. అప్పుడు హృదయంలో నుండి శాంతి, ఆనందం పొంగి మీ సహస్రారంలోనికి వస్తుంది. అయితే అమృతనాడిని భగవంతుడే ఓపెన్ చేయాలి కాని మనం ఇనుపపెట్టిని తాళం పెట్టి ఓపెన్‌చేసినట్లు దానిని ఓపెన్ చేయలేము. అది ఓపెన్ అయినప్పుడు మీ హృదయం, మెదడు ఒకటి అయిపోతాయి. ఎందుకు అంటే హృదయంలో ఉన్న శాంతి వచ్చి మెదడును ముంచేస్తుంది. అప్పుడు సృష్టి కూడా మీకు దైవంగానే కనబడుతుంది కాని సృష్టి సృష్టిగా కనబడదు.

రాముడు అరణ్యానికి వెళ్ళటం ఆ గొడవలు అన్నీ అయిపోయినతరువాత ఒకసారి మంధర భరతుడికి కనిపిస్తుంది. మంధరను చూసేటప్పటికి భరతుడికి కోపం వచ్చింది. మన కుటుంబంలో గొడవలన్నింటికి ఇదే కారణం అని ఉద్రేకపడి మంధరను హింసపెట్టటానికి సిద్ధమవుతాడు భరతుడు. అప్పుడు కౌసల్య దగ్గరగా ఉంది. కౌసల్య భరతుడితో ఏమంది అంటే దానిని పొమ్మంటే పోతుందికదా, అంతేగాని మంధర ఏ స్థాయిలో ఉందో ఆ

స్థాయిలోనికి నువ్వు దిగిపోతావా? అని చెప్పింది. కోపం వచ్చినప్పుడు బుద్ధిలో ఉన్న వివేకం తగ్గిపోతుంది. కోపంగా ఉన్నప్పుడు మాట్లాడితే రీజన్‌ను వదిలేస్తారు, చెడ్డ మాటలు వచ్చేస్తాయి. అందుచేత కోపం వచ్చినప్పుడు కొంతసేపు నోరుమూసుకుని ఉండటం మంచిది. కోపం వచ్చినప్పుడు బ్రెయిన్ సరిగా పనిచేయదు. రిపీటెడ్‌గా కోపం వచ్చేవాడు నెమ్మదిగా పిచ్చివాడు అయిపోతాడు. కొంతమందివారికి వచ్చిన కష్టాలు, బాధలు భరించలేక చనిపోతూఉంటారు. వారికి ఎటుచూసినా ముళ్ళకంపే. ఆ సమస్యలు ఎలా పరిష్కారం చెయ్యాలి అనేది ఆ టైములో వారికి దారి కనబడదు. అది మెదడులో ఉన్న లోపం. అప్పుడు ఏవో లేనిపోనివి ఊహించుకోవటం వలన అది ఆత్మహత్యకు కారణం అవుతుంది. మీరు అగౌరవం వచ్చినప్పుడు దానిని భరించటం నేర్చుకోవాలి. ఎన్నికష్టాలు వచ్చినా, నష్టాలు వచ్చినా వాటిని నిర్మలంగా భరించటం, క్వయిట్‌గా కామ్‌గా కూల్‌గా హేపీగా ఉండటం అలవర్చుకోవాలి. ఇన్ని బాధలు, కష్టాలు, అగౌరవాలు ఈ జీవుడికి పంపితే చాలా క్వయిట్‌గా ఫేస్ చేస్తున్నాడు ఏమిటి? చాలా శాంతిగా, కూల్‌గా ఉన్నాడు ఏమిటి? అని ఈశ్వరుడే ఓడిపోయి, ఈశ్వరుడికి ఆశ్చర్యం కలిగి అప్పటికప్పుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. బేర్ ఇన్‌సల్ట్, బేర్ ఇంజురీ దట్ ఈజ్ ఆల్ సో పార్ట్ ఆఫ్ సాధన.

మీకు కర్మఫలం ఎక్కువ రావచ్చు, తక్కువ రావచ్చు. మీరు సమానబుద్ధిని కలిగి ఉండండి. మిమ్మల్ని ఎవరైనా తిట్టారు అనుకోండి, దానిని వచ్చే జన్మలకు మోసుకొని వెళ్ళకండి. మిమ్మల్ని ఎవరైనా పొగిడారు అనుకోండి దానిని వచ్చే జన్మలకు మోసుకొని వెళ్ళకండి. మీ దేహం చనిపోయేలోపు వాటిని ఇక్కడే వదిలేయటం నేర్చుకోండి. ఏమి అపూర్వమైన టీచింగో చూడండి. మిమ్మల్ని ఎవరైనా అగౌరవపరిచారు అనుకోండి దానిని ఇక్కడే వదిలేయండి. నన్ను ఫలానావారు అగౌరవపరిచారు అని చనిపోయేవరకు బుర్రలో దానిని మోస్తూఉంటే, అది మీ బ్రెయిన్‌లో ఉండిపోతే మరణానంతర జీవితంలో అది మీకూడా వచ్చేస్తుంది. మీకు మంచి జరిగినా, చెడ్డ జరిగినా, అగౌరవం వచ్చినా, సుఖాలు వచ్చినా, దుఃఖాలు వచ్చినా, మీ పుణ్యపాపాలను, మీ పొరపాటు లేకపోయినా మిమ్మల్ని హింసలకు గురిపెట్టినప్పటికీ, మీకులాభం వచ్చినా, నష్టం వచ్చినా సమస్తం కూడా మీ శరీరానికి మరణం వచ్చేలోపులో ఇక్కడే విడిచిపెట్టేయండి, మీకూడా తీసుకొని వెళ్ళకండి. మిమ్మల్ని ఎవరు అగౌరవపరిచారు. చైతన్యస్థాయి కొంచెం కూడా లేనివాడు. అటువంటి వాడి మాటలు భుజాన వేసుకొని తిరుగుతారా? ఆ గొడవలు అన్నీ వచ్చే జన్మకు మోసుకొని వెళతారా? అందుచేత ఇటువంటి

గొడవలు అన్నీ మీ శరీరానికి మరణం రాకముందే ఇక్కడే వదిలేయండి. వాటినన్నింటిని మీ కూడా పట్టుకొని వెళ్ళకుండా ఇక్కడే వదిలేస్తే మీరు దుఃఖంలేని స్థితిని పొందుతారు. సారోలెస్ స్టేట్‌కి వెళ్ళిపోతారు.

గౌతమబుద్ధుడు అతి కంపేషన్, 100% కంపేషనేట్ మేన్, వాకింగ్ కంపేషన్. కంపేషన్ ఈ భూమి మీద నడుస్తోందా అనిపిస్తుంది. ఏ జీవి దుఃఖంలో ఉన్నా నువ్వు నాకూడా రా, దుఃఖంలేనిస్థితికి తీసుకొనిపోతాను నాకూడా రా. స్వర్గం, నరకం అనికాదు. ఇక్కడే ఈ భూమిమీద ఉండగానే దుఃఖ స్పర్శ ఎలా ఉంటుందో తెలియని స్థితికి తీసుకొనివెళ్ళటానికి ప్రయత్నం చేస్తాడు, వాడు బుద్ధుడు. మీ బుద్ధి బాగా పక్వానికి వస్తే ఏ లోకంలో అయితే సుఖం ఉందో, ఆ లోకంలో ఉన్న సుఖాన్ని కూడా మీరు ఇక్కడకు తీసుకొనిరాగలరు. పురాణాలలో ఏ లోకంలో సుఖం ఉంది అని చెపుతున్నారో, ఆ లోకంలో ఉన్న ప్రజలు ఎంతపవిత్రంగా ఉన్నారో మీరు కూడా అంత పవిత్రం అయితే ఆ లోకంలో ఉన్న సుఖాన్ని మీరు ఇక్కడకు తీసుకొనిరాగలరు. అంటే ఆపైన ఉన్నదానిని కిందకు తీసుకొని రాగలరు, అంతశక్తి మీకు వస్తుంది. అది ఎక్కడనుండి వస్తుంది అంటే పీస్‌లో నుండి వస్తుంది, బ్లిస్‌లోనుండి వస్తుంది. మన మనస్సులో అజ్ఞానానికి మించిన మాలిన్యంలేదు, అవిద్యకు మించిన మాలిన్యం లేదు. కొంతమంది హరేకృష్ణ, హరేకృష్ణ అంటూ గంతులు వేస్తూ ఉంటారు. అదీ భక్తే. ఆ సంకీర్తన వలన తాత్కాలికంగా కొన్ని బలహీనతల నుండి వారు తప్పకోవచ్చు కాని భగవాన్ ఏమంటున్నారు అంటే ఎన్నాళ్ళు ఇలా ఎస్కేప్ అవుతావు, వాటిని ఫేస్ చెయ్యి అంటున్నారు. ఏదో సంకీర్తనచేసి నీ మనస్సుని డైవర్షన్ చేస్తే తాత్కాలికంగా నీకు బాగానే ఉంటుంది కాని నీలో ఉన్న బలహీనతలు అలాగే ఉండిపోతాయి. వాటిని ఫేస్ చెయ్యి. ఆ బలహీనతను ఫేస్ చెయ్యటం వలన కొంతకాలానికి అది పోతుంది కాని దాని నుండి తప్పించుకొని తిరగటం వలన అదిపోయే అవకాశంలేదు.

మీరు ఏ కులమైనా, మీది ఏ మతమైనా జీవితం పొడుగునా మీరు సుఖపడాలి అంటే మీకు ధనం ఉన్నా లేకపోయినా మీకు చదువు ఉన్నా లేకపోయినా అదర్‌నెస్ ఉండకూడదు. ఈ ఒక్కటి గుర్తుపెట్టుకొని మీరు ఇంటికి వెళ్ళిపోండి. మీరు ఏదైనా మంచి చేస్తే అందరూ మనలను మెచ్చుకొంటున్నారా లేదా లేకపోతే మన గురించి ఇతరులు ఏమనుకొంటున్నారు అని ఇలా మీరు అనుకొంటారు కదా! మీకు ఇతరులు కనిపిస్తున్నారు కాబట్టి ఇవన్నీ వస్తున్నాయి. ఇతరులు మీ గురించి మంచిగా అనుకొంటే మీకు గర్వం

వస్తుంది, చెడ్డగా అనుకొంటే మీకు దుఃఖం వస్తుంది. అసలు మీకు ఇతరులు కనబడటంలేదు అనుకోండి ఇంక మీకు అశాంతిలేదు, దుఃఖంలేదు, గర్వంలేదు, ఏమీలేదు. అది ప్రాక్టీసు చెయ్యండి. అసలు లోకంలో నువ్వు ఉన్నావు అంతే, అదర్‌నెస్ లేదు. ఎప్పుడైతే మీకంటే భిన్నంగా ఇతరులెవరు మీకు కనబడటంలేదో అందరూ మనలో ఉన్నారు, మనం అందరిలోనూ ఉంటాము. అప్పుడు మనం ఒకటిగానే ఉంటాము. ఎప్పుడైతే అదర్‌నెస్ పోయిందో అప్పుడు మీరు కూర్చున్నవాళ్ళు లేవకుండానే మీకు సుఖం వచ్చేస్తుంది. వారు అలా అన్నారు అని భగవాన్‌తో అంటే వారంటే ఎవరు? అసలు వారంటూ ఒకరు ఉన్నారా? ఉన్నది ఒక్కటే వస్తువు. మానసిక ప్రవృత్తులు తేడాగా ఉండవచ్చు. ఇతరులు అంటూ ఏమీలేదు. ఉన్నది నువ్వే. నీకు భిన్నంగా ఏదీ లేదు. నీకు భిన్నంగా ఏదైనా ఉంది అనుకొన్నప్పుడే నీకు భయం వస్తుంది. ఇతరులు ఉన్నారనుకొన్నప్పుడే నీకు భయం కలుగుతుంది. నీకు భిన్నంగా ఏదీ లేదు ఈ లోకంలో అనే అనుభవం నీకు కలిగినప్పుడు నువ్వు భయరహితడవు అవుతావు. అదే అమృతస్థితి. భయం ఉంటే నష్టం ఏమిటి అంటే భయం ఉంటే దుఃఖం వస్తుంది. భయం, క్రోధం, రాగం, ద్వేషం ఇవి అన్నీ మనస్సుకు వచ్చే వికారాలు, మనస్సులో వచ్చే కెరటాలు, మనస్సులో వచ్చే రియాక్షన్స్. నువ్వు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే నీకు యాక్షన్ ఉండవచ్చుకాని రియాక్షన్ ఉండకూడదు.

నీ పని ఏదో నువ్వు చేసుకొంటూ వెళ్ళు. అది కొంతమందికి నచ్చవచ్చు, కొంతమందికి నచ్చకపోవచ్చు. కొంతమంది ఆ పని బాగానే ఉంది అంటారు, కొంతమంది విమర్శిస్తారు. ఆ పనిని మెచ్చుకొన్నా అటువెళ్ళకు, దానిని విమర్శించినా అటు వెళ్ళకు. నువ్వు అటూ వెళ్ళవద్దు, ఇటూ వెళ్ళవద్దు. నీ మనస్సును శుద్ధి చేసుకొంటూ, నీ బుద్ధిని శుద్ధి చేసుకొంటూ నీ పని ఏదో నువ్వు చేసుకొంటూ వెళ్ళిపో. ఇతరుల గొడవలలోనికి వెళ్ళవద్దు. సాధ్యమైనంతవరకు ఇతరుల గొడవలలో కలుగజేసుకోవద్దు అని భగవాన్ ఎందుకు చెప్పారు అంటే నీవు ఇతరుల గొడవలలో కలుగజేసుకొనేకొలది నీలో అహంకారం పెరిగిపోతుంది. ఇతరులు అంటే ఎవరు? వారి అహంకారం. ఇతరుడు అనేవాడు బ్రాహ్మీస్థితిని పొందాడా? వాడు ఏమైనా ఆత్మానుభవం పొందాడా? వాడికి ఏమైనా దైవీసంపద ఉందా? లేదు. అటువంటి వారి గొడవ నీకు ఎందుకు? ఇతరులు అనేవారు లేరు అని నోటితో చెప్పటంకాదు, ఇతరులు అనేవారు లేరు, అదర్‌నెస్ లేదు అనే అనుభవం మీకు లోపల కలిగితే ఆ క్షణంలో ఆనందం, శాంతి వచ్చి మిమ్మల్ని వరిస్తాయి. అదర్‌నెస్ ఉంటే వారు అలా ఉన్నారు, వీరు

ఇలా ఉన్నారు అని ఏదో ఒకటి అనుకొంటూ ఉంటారు కదా! అదర్‌నెస్ అంటూ లేకపోతే మనం సుఖంగా, శాంతిగా ఉండవచ్చు. ఇతరులు ఎవరూ లేరు అనే అనుభవం నీకు కలిగితే అదే అద్వైతానుభవం. అద్వైతం అంటే అక్కడ రెండు లేదు, ఉన్నది ఒక్కటే. యు మస్ట్ నో ద ట్రూత్ అండ్ ద ట్రూత్ ఓన్లీ షల్ మేక్ యు ఫ్రీ అని బైబిల్‌లో చెప్పాడు. నీకు ఫ్రీడమ్ కావాలా? నీకు శాంతి కావాలా? యు మస్ట్ నో ద ట్రూత్ అంటే సత్యానుభవం పొందు, నీకు ఇంకో మార్గం లేదు.

భగవంతుడు ఎక్కడో మనకు దూరాన లేడు. మన హృదయంలోనే అంతర్యామిగా ఉన్నాడు. ఇప్పుడు ఈ శరీరమే నేను, మనస్సే నేను అని శరీరంతోటి, మనస్సుతోటి ఎలా తాదాత్మ్యం పొందుతున్నారో అలాగ లోపల ఉన్న సత్యంతో, అంతర్యామితో తాదాత్మ్యం పొందితే అప్పుడు నీకు పుట్టుకలేదు, చావు లేదు. అప్పుడు నువ్వు బాడీలెస్, మైండ్‌లెస్ అండ్ గాడ్‌లెస్ ఆల్‌సో. అది సుప్రీమ్ స్టేట్. అది సామాన్యంగా దొరకటం కష్టం. దానికోసం జీవితాన్ని డెడికేట్ చేసిన వారికి కాని అది దొరకటం కష్టం. అద్వైతం అంటే రెండు లేనిది. ఉన్నది ఒక్కటే మనకు అనుభవంలోనికి వచ్చేవరకు ఈ జననమరణచక్రం నుండి విడుదలయ్యే అవకాశంలేదు. ఈలోపుగా తాత్కాలిక ప్రయోజనాల కోసం చూడవద్దు. ఆ గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయత్నం చేయండి. అసలు మీరు ఏది పొందాలి, దేనిని పొందిన తరువాత ఇంక మీకు తెలుసుకోవలసింది అంటూ ఉండదో, దేనిని పొందిన తరువాత మీకు పూర్వం విన్న విషయాలమీద, పూర్వం చదువుకున్న విషయాల మీద రోత పుడుతుందో ఆ వన్‌నెస్ మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడే మీకు అద్వైతానుభవం కలుగుతుంది, సత్యానుభవం కలుగుతుంది. అయితే దీనికి మీకు పూర్వపుణ్యం ఉండాలి, సత్కర్మబలం ఉండాలి, సత్పురుషుల సహవాసం ఉండాలి, ఈశ్వరుడిపట్ల డెడికేషన్ ఉండాలి, డివోషన్ ఉండాలి. వీటితోపాటు ఈశ్వరుడిదయ ఉంటే వాడు అద్వైతానుభవం పొందగలడు. అది అల్టిమేట్ స్టేట్. ఆ స్థితిని మీరు పొందినప్పుడు ముగింపులేని శాంతిలో, ముగింపులేని ఆనందంలో ఊగిసలాడతారు. అటువంటి పరమస్థితిలోనికి, పరమజ్ఞానంలోనికి మనం అందరం మేల్కోవాలని, అలా మేల్కొనేవిధంగా భగవంతుడు మిమ్మల్ని అందరిని అనుగ్రహించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

పుట్టినరోజు కార్యక్రమాల గురించి అమలాపురం మాష్టారు చెప్పారు. అసలు బర్త్‌కి బర్త్ లేదని, డెత్‌కు డెత్ లేదని ఉపనిషత్ చెబుతోంది. బర్త్‌కు బర్త్ ఉంటే మనందరం

పుట్టవచ్చు, డెత్‌కు డెత్ ఉంటే మనందరం చనిపోవచ్చు. వాస్తవంలో రెండూ లేవు. పుట్టుక అనేది ఒకటి ఉంటే నువ్వు పుడతావు అసలు పుట్టుకే లేనప్పుడు మనిషి ఎలా పుడతాడు? అలాగే అసలు చావే లేనప్పుడు మనిషి ఎలా చనిపోతాడు? ఇంక మనుషులు ఎక్కడ ఉన్నారు అంటే దాని అర్థం ఉన్నది బ్రహ్మం ఒక్కటే. దానికి పుట్టుకలేదు, చావులేదు. అద్వైతం అంటే అదే.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-08-2014, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన దుఃఖానికి కారణం ఏమిటి అంటే మన అహంకారమే దుఃఖానికి కారణం. మీకు ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, కీర్తి ఉండవచ్చు ఎన్ని ఉన్నా మనలో అహంకారం ఉన్నంతసేపు ప్రతీ మనిషినీ కూడా దుఃఖం వెంటాడుతుంది. ఒక మనిషికి దుఃఖం రావటానికి వాడి కుటుంబపరిస్థితులు, సమాజపరిస్థితులకంటే అహంకారమే మెయిన్ కారణం. భగవాన్, బుద్ధుడు కూడా చాలా తక్కువగా మాట్లాడేవారు. మీరు అవసరంలేని మాటలు మాట్లాడుతూ ఉంటే మీరు చెప్పేది బుద్ధుడు వినేవాడు. మీరు చెప్పిన మాటలు నాకేమైనా ఉపయోగపడతాయా అని అడిగేవాడు. ఆ మాటలు మీకు ఉపయోగ పడవు అని చెప్పేవారు. నాకేమీ ఉపయోగపడనప్పుడు అవి నాతో ఎందుకు మాట్లాడుతున్నారు అనేవాడు. అంటే ప్రతీ మనిషి కూడా అహంకారం వలన ఎక్కువగా మాట్లాడుతున్నాడు కాని అవసరాన్ని బట్టి మాట్లాడటంలేదు. అవసరం ఉంటే మాట్లాడవచ్చు. అహంకారంకోసం మాట్లాడుతూ ఉంటే దానివలన వ్యక్తిభావన పెరిగిపోతుంది.

మనం శాంతిగా ఉండాలి. ఈ శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటకు వెళ్ళేటప్పటికి మన జీవలక్షణాలు అన్నీ పోయి పరమాత్మలో ఐక్యమయ్యే స్థితికి చేరుకోవాలి అని మనం కోరుకుంటున్నాము. అలా కోరుకోవటంలో పొరపాటులేదు. మనకు దుఃఖం ఉండకూడదు అనుకొంటాము కారణం మన స్వభావంలో అది లేదు కాబట్టి అలా అనుకొంటున్నాము. అయితే దురదృష్టం ఏమిటి అంటే మనకు వచ్చే తలంపులు దుఃఖాన్ని తీసుకొనివచ్చే తలంపులు వస్తున్నాయి. నోటితో దుఃఖాన్ని తీసుకొని వచ్చే మాటలు మాట్లాడుతున్నాము, చేతితో దుఃఖాన్ని తీసుకునివచ్చే పనులు చేస్తున్నాము, కోరుకోవటం మటుకు సుఖాన్ని కోరుకుంటున్నాము. తూర్పువైపుకు వెళ్ళాలి అనుకుంటున్నాము. పడమరవైపుకు నడుస్తున్నాము. మన పరిస్థితి

ఇలా ఉంది. మనం ఏదైతే ఆశిస్తున్నామో దానికి అనుగుణమైన కర్మ ఉండాలి. మనకు హేపీనెస్ కావాలి. అందుచేత భగవంతుడు మనకు ఇచ్చిన నోటితో మనకు హేపీనెస్ తీసుకొని వచ్చే మాటలు మాట్లాడాలి, చేతితో మనకు హేపీనెస్ తీసుకొనివచ్చే పనులు చెయ్యాలి, మనకు వచ్చే తలంపులు అన్నీ కూడా మనకు ఆనందాన్ని తీసుకొనిరావాలి. హేపీనెస్‌కు దూరం చేసే మాటలను, హేపీనెస్‌కు దూరం చేసే తలంపులను మనం కంట్రోలు చేసుకోవాలి.

కృష్ణుడు ఏమనిచెప్పాడు అంటే నీ దేహయాత్రకు సరిపడ పని చేసుకుంటూ, నీ దేహయాత్రకు సరిపడ ధనం విషయంలో ఇతరులమీద ఆధారపడకు. ఇతరులమీద ఆధారపడితే నీకు బానిసత్వం వస్తుంది అని చెప్పాడు. రైట్‌పాత్‌లో సంపాదించటం అనేది కొంతమందికి ఒక ఆర్ట్. అది అందరికీ ఉండదు. అయితే నీ అవసరాలకు మించి సంపాదించే శక్తి నీకు ఉంటే ఆ శక్తిని నువ్వు పాడుచేసుకోనక్కరలేదు. నీ అవసరాలకు జాగ్రత్తపెట్టుకొని మిగిలిన ధనాన్ని సమాజానికి ఉపయోగించవచ్చు. అందులో ఏమీ పొరపాటు లేదు, అది కూడా యజ్ఞమే అని బుద్ధుడు చెప్పాడు. ప్రపంచంలో ఏది జరిగినా, ఏది జరగక పోయినా దేహం వచ్చింది అంటే అది మరణించటం తథ్యం. మనం అనుకొన్నవి జరగవచ్చు, జరగకపోవచ్చు కాని మరణం రావటం అనేది నూటికినూరుపాళ్ళు జరుగుతుంది. దేహం వచ్చింది అంటే అది ఏదోరోజు మరణించటం తథ్యం. ధర్మరాజు ఇంటి దగ్గర ఏదో ఫంక్షన్ జరిగింది. ఫంక్షన్ అయిపోయిన తరువాత అందరూ వెళ్ళిపోతున్నారు. ధర్మరాజు అతిథులను సాగనంపుటలో బిజీగా ఉన్నాడు. ఏమండీ మీకు తోచింది ఏదైనా ఇవ్వండి అని ఎవడో యాచకుడు వచ్చాడు. రేపు రావయ్యా అన్నాడు ధర్మరాజు. వాడు వెళ్ళిపోతున్నాడు. ప్రక్కనే భీముడు ఉన్నాడు. ధర్మజా! వీడిని రేపు రమ్మంటున్నావు రేపటిదాకా నువ్వు, వాడు ఉండాలి కదా! ఇవ్వటానికి రేపు రమ్మంటావు ఏమిటి? నీకు తోచింది ఇచ్చి పంపించేయి అన్నాడు భీముడు. అందుచేత నువ్వు ఏదైనా మంచి పని చేయాలనుకొన్నప్పుడు వాయిదా వేయవద్దు, మీకు ఏదైనా చెడుతలంపు వస్తే దానిని వాయిదా వేస్తూ వెళ్ళండి అంటే పోస్ట్‌పోన్ చేసుకుంటూ వెళ్ళండి, అప్పుడు అది నెమ్మదిగా సన్నగిల్లిపోయి చనిపోతుంది. మంచిపని చేయాలనుకున్నప్పుడు మీరు వెంటనే చేసేయండి, పోస్ట్‌పోన్ చెయ్యకండి. అదే మీకు ఏదైనా చెడ్డ ఆలోచన వచ్చినప్పుడు దానిని వెంటనే యాక్షన్‌లో పెట్టకుండా పోస్ట్‌పోన్ చేస్తే కొంతకాలానికి దానికి నేచురల్‌గానే డెత్ వచ్చేస్తుంది.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# స్వీయ సంస్కరణ

మనము శాంతిని ఆనందాన్ని కోరుకుంటాం, కాని మనము ఏరకంగా జీవిస్తే శాంతి, ఆనందం లభిస్తాయో ఆ ప్రయత్నం చెయ్యము. పరమాత్మకు మరోపేరే శాంతి. మనము కోరుకునే శాంతి, ఆనందం మన స్వరూపంగా హృదయంలోనే ఉంది. కాబట్టి పరమాత్మకన్న వేరుగా ఉన్నాను, అనే వేరుభావన నుండి అనగా వ్యక్తిభావన నుండి విడుదల పొందాలి. కేవలం ఉనికి గల బ్రహ్మమే మన దృష్టికి లోకంగాను, ఇతరులు గాను కనిపిస్తోంది. మనకు స్వరూపశాంతి అనుభవైకవేద్యం కావాలంటే ఇతరులలోని దోషాలను కాకుండా, వారిలోని అంతర్యామినే దర్శించాలి. నీటిబుడగను మహాసముద్రంగా దర్శించే విశాల దృష్టిని అలవరచుకోవాలి. ప్రపంచాన్ని పరమాత్మగా దర్శించాలి. మనలోని దోషాలను, చెడు ఆలోచనా సరళిని సరిదిద్దుకొని మనను మనమే సంస్కరించుకోవాలి. ఇతరులను మార్చే ప్రయత్నము, పరిస్థితులను మార్చే ప్రయత్నము చెయ్యకుండా, మనను మనము మార్చుకునే ప్రయత్నం చెయ్యాలి, అదే గొప్ప సంస్కరణ. ప్రపంచం అనే సమిష్టి కుటుంబంలో మనమంతా సభ్యులమే! చిన్న పనినైనా అత్యంత శ్రద్ధగా చేస్తూ, ఓర్పు, సహనంతో ముందుకు సాగాలి. మనస్సే సంసారం. మన మనస్సు బాధపడకుండా ఉండాలంటే, ఇతరుల మనస్సును బాధపెట్టకూడదు. ఇతరుల గురించిన చెడుతలంపులను మనస్సులో మొయ్యకూడదు, అనుకరణ పనికిరాదు. మనను మనం బాగుచేసుకోవడానికి సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. సహనము, సౌశీల్యము, సామరస్యం, మైత్రి, సేవాగుణము, మున్నగునవి అలవరచుకోవాలి. త్రికరణాల ద్వారా అహంకారం వ్యక్తం కాకుండా, వాటిని పరమాత్మకేంద్రంగా ఉపయోగించుకోవాలి. దేహం జీవించియుండగానే మనం పొందవలసిన నిరహంకారస్థితిని పొందితీరాలి. అహంకారానికి సంతృప్తి కలిగించే పనులుకాక, పరమాత్మకు ప్రీతి కలిగించే పనులు చెయ్యాలి. అజ్ఞానం దూరంగా ఎక్కడో లేదు, దేహము-నేను అను తలంపు రూపంలో ఉంది. సాధన లేకుండా ఏది సాధ్యంకాదు కాబట్టి, ఎలా జీవిస్తే పరమాత్మను స్వరూపంగా అనుభవైకవేద్యం చేసుకోగలమో, అలా జీవించడమే ధర్మం.

ఓంతత్‌సత్

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# మోహానికి మూలకారణం అజ్ఞానం - దాని నాశనానికి గురువును శరణుపొందాలి - 2

దుఃఖానికి మూలకారణం అయోమయం. బ్రహ్మానందానికి పునాది స్పష్టత. అది తెలిస్తే ఆనందంగా ఉంటాము. జాగరూకతే జీవితమని తెలుస్తుంది. మనం ఆకారాల్లో మమకారం పెట్టుకొన్నాము. మన కళ్ళు రూపం దగ్గర ఆగిపోయి ఉన్నాయి. గురువుకు శరణు పొందితే సాయం సాధ్యమౌతుంది. మనం మానసిక మరణానికి సిద్ధంగా ఉండాలి. గురువు వద్దకు మనం తీర్పులతో వెళితే అసలు ఏమాత్రం వెళ్ళనట్లే. సద్గురువులు కొద్దిమందే ఉంటారు. అటువంటి వారితో ప్రభావితం కావటం కష్టం. ఎందుకంటే మన సొంతమైన అహంకారం చనిపోవటం అన్నమాట. గురువు మనపై పనిచెయ్యటానికి ఒప్పుకోవటం మిక్కిలి సాహసవంతమైనదిగా ఉంటుంది. ఆయన మన హృదయాన్ని తెరిస్తే కోట్లాది వాసనలు ఉంటాయి. మనలను ఆయన ఎక్కడికి తీసుకొనివెళ్ళుతారో తెలియదు. మనం విశ్వసించాలి. తర్కం ప్రయోజన కారి కాదు. ప్రేమ మాత్రమే సాయం చేస్తుంది. మనలో ప్రేమ మరుగునపడి ఉంటుంది. విద్యను గురు అనుగ్రహంతో, గురుముఖతః నేర్చుకోవలసిందే కాని మరో మార్గం లేదు. కంటికి కనబడనిది సత్యం అది నిర్వికారము, అవి నాసి, కంటికి కనబడే రూపాలు అన్నీ మార్పుచెందేవి, నశించేవి. కాని మనం దాన్నే శాశ్వతమని తలుస్తాము. మనం పిరికి వాళ్ళమై దేవతల వద్ద మొరపెట్టుకొంటే గట్టు ఎక్కలేము. కుక్కచావు తప్పదు. మూఢవిశ్వాసాలకు మోకరిల్లి మన మనస్సును అమ్ముకోకూడదు. మనం అనంతులం, అమరులము, అభయులమని నిశ్చయించుకోవాలి. సంభవిస్తున్నవన్నీ నశించేవనే ఎరుక కావాలి. మనం మూర్ఖులుగా, నిర్లక్ష్యంగా ఉంటే గురువు సాయం అందదు. వినయం, విధేయత, సత్యాన్ని తెలుసుకోవాలనే కాంక్ష సాధన కావాలి. అప్పడే ఆయన మార్గదర్శి అవుతారు. అది మనకు అమూల్య నిధి. ఆయన మనలను నిరంతరం ప్రోత్సహిస్తూ, భుజం తడుతూ ఉంటారు. మనకు ఈ సమాజం ఇచ్చే అబద్ధపు వ్యక్తిత్వాన్ని కొంచెం కొంచెం తీసేస్తూ ఉన్నా ఆటంకపరచము. మనకు ఏ హానీ చెయ్యరని, ఏ సాహసానికైనా సిద్ధంగా ఉంటాము. అదే గురువు యొక్క కళ. అప్పడే మనకు నవోదయం అవుతుంది. గురువుతో మనం గడపటం వల్ల పొందే అందం, పరమానందం అని మనకు తెలుస్తుంది. అది మనం ఆవిష్కరించుకొన్న మహాభాగ్యమే. గురువుయొక్క సన్నిధి ఎంత అమోఘమో గోపికలకున్న అనుభవములో కించెత్తు ఉన్నా అది జ్ఞానోదయం, మోక్షం, అనే మాటలు పాడిపాడిగా తోస్తాయి. అంతకన్న అధికం లేదు అని మనం అనుకొన్నా గురువుకు అన్నీ తెలుసు. ఇంతకన్న అధికమైనది ఉందని ఇందుల్లో ఇరుక్కు పోనియ్యడు, అదీ బంధమే కాని చివరిది. అనంతంలోకి గల ద్వారాలను తెరవటానికి అదే. అప్పడు గురువు సందేశం "నా దారిలోంచి తొలగు" అనే సంకేతాలు ఇస్తాడు. తోతాపురి రామకృష్ణుని ఇచ్చినట్లు. అప్పడు మనం నష్టపోయేది ఏమీ లేదు. సహజానందంతో స్థిరత్వం పొందుతాము. మన అహంకారాన్ని నాశనం చెయ్యటమే గురువు లక్ష్యం, కర్తవ్యం. ఆ రుణం మనం తీర్చలేనిది అని జీవితాంతం గుర్తుంచుకోవాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**